క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నూజివీడు: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో సంబంధిత వాల్‌పోస్టర్‌ను శుక్రవారం సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అనేక నష్టాలు ఎదురవుతాయని, ఈ నేపథ్యంలో రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. డాక్టర్ జి. రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నూజివీడులోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న లోక్ అదాలత్‌లో వీలున్న అన్ని క్రిమినల్, బ్యాంకు రికవరీ కేసులు, ఎక్సైజ్, చెక్ బౌన్స్, మోటార్ యాక్సిడెంట్, సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో పరిష్కరిస్తామని చెప్పారు. రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై న్యాయవాదులు, పోలీసులు కూడా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

రేషన్ షాపు ఏర్పాటు చేయాలి



ఇబ్రహీంపట్నం: కేతనకొండ బీసీ ఏరియాలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు గురువారం నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గతంలో బీసీ కాలనీలో బీసీ కోటాలో ఏర్పాటు చేసిన షాపును కొందరు కావాలని పదో వార్డు ఓసీ ఏరియాకు మార్పు చేసుకున్నారని చెప్పారు. బీసీ వాసులు రేషన్ కోసం ఓసీ ఏరియాకు వెళ్లేందుకు 65వ నంబర్ జాతీయ రహదారి దాటాల్సి రావడం వలన వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. గతంలో తమకు కేటాయించిన షాపును తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, మండల కో–ఆప్షన్ సభ్యుడు పఠాన్ నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యులు పులి సువర్ణరాజు, రంగస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ అమరావతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు 100 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమున్న వారిని గుర్తించి విజయవాడకు సిఫారసు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నగదు బహుమతుల ప్రదానం

మైలవరం(జి.కొండూరు): ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయడం వల్ల వారి మధ్య పోటీతత్వం పెరిగి భవిష్యత్‌లో మంచి ఫలితాలు సాధించేందుకు వీలుంటుందని ఎంఈఓ ఎల్.బాలు అన్నారు. మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గత పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం స్థానిక ఎస్‌ఎస్‌కే పాఠశాలలో అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కాటమనేని వెంకటేశ్వరరావు, అడుసుమిల్లి విఠల్ బాబు, జూలకంటి ప్రసాద్, గూడూరు నాగిరెడ్డి, కోయసుధ, అమీర్ హంజా, గొల్లపూడి మోహన్‌రావు, భావన పాల్గొన్నారు.

'ఆదికర్మ యోగి'తో గిరిజన గ్రామాల అభివృద్ధి

చాట్రాయి: గిరిజన గ్రామాల అభివృద్ధికి ఆదికర్మ యోగి అభియాన్ పథకం వరం లాంటిదని ఐటీడీఏ ఎంఈఓ రవి ప్రసన్నకుమార్ అన్నారు. పోతనపల్లి తండాలో శుక్రవారం ఆదికర్మ యోగి పథకంపై నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గిరిజనులు ఆర్థిక, సామాజిక స్థాయిని పెంచుకుంటారని చెప్పారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర వసతుల రూపకల్పనకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఎంపీటీసీ భారతి, ఐటీడీఏ అధికారిణి రాజేశ్వరి, ఎంఈవో–2 బ్రహ్మచారి పాల్గొన్నారు.

50 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చిన్నంపేట గ్రామంలో పరసా నాగేశ్వరరావు సారా తయారు చేస్తున్నారని సమాచారం అందింది. దీంతో దాడి చేసి 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

వంతెనలు..ఎన్నాళ్లైనా ఇంతేనా!

- 1980లో రెండు వంతెనల నిర్మాణం
- శిథిలావస్థకు చేరుకున్న వంతెనలు
- వంతెనల దుస్థితిపై గ్రామస్తుల ఆందోళన
- అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యం



తుమ్మలపాలెంలో కూలింగ్ కెనాల్‌పై శిథిలావస్థకు చేరిన ఎన్టీటీపీఎస్ వంతెన



తుమ్మలపాలెంలో కూలింగ్ కెనాల్ శిథిలావస్థకు చేరిన ఫుట్‌వే స్థానంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన నూతన ఫుట్‌వే

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటిని తరలించేందుకు తుమ్మలపాలెం గ్రామం మధ్య నుంచి ఏర్పాటు చేసిన కాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. 1980లో వాహనాల రాకపోకలకు ఒకటి, ఫుట్‌వేగా మరొక వంతెనను నిర్మించారు. సుమారు 20 ఏళ్లకే ఫుట్‌వే వంతెన శిథిలావస్థకు చేరడంతో 2003లో మరొక ఫుట్‌వే వంతెన నిర్మించారు. వాహనాల రాకపోకలకు ఏర్పాటు చేసిన వంతెనకు 45 ఏళ్లు గడవడంతో శిథిలావస్థకు చేరింది. నూతన వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యేలు, ఎన్టీటీపీఎస్ అధికారులకు గ్రామస్తులు విన్నవించినా ఫలితం లేదు.

కూలేదశలో ఎన్టీటీపీఎస్ వంతెన

తుమ్మలపాలెం గ్రామానికి దక్షిణం వైపు కృష్ణానది, ఉత్తరం వైపు 65వ నంబర్ జాతీయ రహదారి ఉంది. ఎన్టీటీపీఎస్ నీటి అవసరాలకు భవానీపురం పంపింగ్ హౌస్ నుంచి ఏర్పాటు చేసిన కాలువ తుమ్మలపాలెం గ్రామం మధ్యలో నుంచి వెళ్లడంతో గ్రామం రెండు ముక్కలుగా విడిపోయింది. 1980లో కాలువతో పాటు నిర్మించిన రెండు వంతెనల్లో ఒకటి లారీలు, కార్లు రాకపోకలకు, రెండోది బైక్‌లు ఆటోలు, కాలినడక బాటగా నిర్మించారు. రెండో వంతెన గతంలోనే కుప్పకూలగా.. 2003లో మరో కాలిబాట ఏర్పాటు చేశారు. పెద్దవంతెన గడ్డర్లకు మధ్యలో ఖాళీలు వచ్చాయి. వంతెన దిమ్మెలు పగుళ్లు ఇచ్చాయి. వంతెన బలహీనంగా ఉంది. 15 టన్నులకు మించిన వాహనాలు వెళ్లకూడదని ఎన్టీటీపీఎస్ అధికారులు బోర్డులు పెట్టారు. వంతెన దుస్థితిపై స్థానికులు అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పాలిశెట్టి తేజ ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదు. వంతెన కూలితే ప్రమాదంతో పాటు రాకపోకలకు ప్రత్యామ్నాయం లేదు. రెండు వైపులా భారీ వాహనాలు వెళ్లే రెండు వంతెనలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం

గ్రామ రవాణాకు దిక్కుగా ఉన్న వంతెన ఏ క్షణమైనా కూలిపోవచ్చు. కూలిపోతే ప్రమాదంతో పాటు ప్రజల వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయం లేదు. రెండు వైపులా పెద్ద వంతెనలతో పాటు కాలువకు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

– బొమ్ము గోపీకృష్ణ, తుమ్మలపాలెం



గ్రామం చాలా నష్టపోయింది

ట్రాన్స్‌కో టవర్ల ఏర్పాటు, కూలింగ్ కెనాల్ నిర్మాణంలో విలువైన భూములు కోల్పోయాం. భూములు తీసుకున్న కుటుంబాలకు ఉద్యోగాలు, ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. ఇప్పటికీ దిక్కు లేదు. సమస్యలు పరిష్కరించాలి.

– చెల్లు పూర్ణచంద్రరావు, స్థానికుడు

కాలువతో పలువురు మృత్యువాత

ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్ తుమ్మలపాలెం గ్రామానికి మధ్యలో నిర్మించారు. కుటుంబాల్లో తలెత్తే చిన్నచిన్న వివాదాలు, మనస్పర్థలతో క్షణావేశంలో పలువురు యువకులు, పెద్దలు ఈ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతుండటంతో ఇది మృత్యుమార్గంగా మారింది. గ్రామం పరిధిలో కాలువకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా ప్రయోజనం లేదు.

విలువైన భూములు కోల్పోయాం

తుమ్మలపాలెం గ్రామంలో 65వ నంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా విలువైన వ్యవసాయ భూములు సుమారు వెయ్యి ఎకరాల వరకు ఇక్కడి రైతులు కోల్పోయారు. ఎన్టీటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లకు, ఏపీ ట్రాన్స్‌కో నిర్మించిన విద్యుత్ టవర్లు, కూలింగ్ కెనాల్ నిర్మాణానికి పచ్చటి పొలాలను రైతుల నుంచి సంస్థ బలవంతపు భూ సేకరణ ద్వారా తీసుకుంది. ఎన్టీటీపీఎస్ సంస్థకు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనే సర్క్యులర్ ఉందని, భూములు కోల్పోయిన కుటుంబాల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ దిక్కు లేదు. కొందరు గతంలో కోర్టులను ఆశ్రయించారు. ఉచిత విద్యుత్‌తో పాటు శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో రెండు నూతన వంతెనలు నిర్మించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు సకాలంలో యూరియా అందించాలి

పుల్లూరు సర్పంచి నాగమల్లేశ్వరి



మైలవరం(జి.కొండూరు): యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి సకాలంలో యూరియాను అందజేయాలని పుల్లూరు సర్పంచి కొనకల్ల నాగమల్లేశ్వరి అధికారులను కోరారు. మైలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పుల్లూరు సర్పంచ్ మాట్లాడుతూ మంగాపురం గ్రామానికి సంబంధించిన రైతులకు యూరియా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. డ్వాక్రా మహిళల సేవింగ్స్ నగదును అధికారులు బలవంతంగా ఫిక్సెడ్ డిపాజిట్లుగా మారుస్తున్నారని చెప్పారు. ఎంపీపీ ప్రసన్నరాణి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అధికారులు నామమాత్రంగా హాజరవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గత సమావేశంలో చేసిన తీర్మానాల తాలూకా పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకుస్తే పరిష్కరిస్తానని చెప్పారు. ఎంపీడీఓ అనూరాధ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

విస్సన్నపేట: మండలంలో ఉపాధిహామీ పథకంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. డ్వామా పీడీ ఎ. రాము మాట్లాడుతూ పనుల్లో చిన్నచిన్న తప్పిదాలు చోటు చేసుకున్నాయని, అవి మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. రూ.1,35, 584 రికవరీ, రూ. 59,800 జరిమానా విధించారు. జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీ,ఏపీడీ పార్థసారథి,ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న



సమావేశంలో మట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు: డివిజన్‌లో లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న హెచ్చరించారు. నూజివీడులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ సమావేశాన్ని సబ్ కలెక్టర్ శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రానురాను మగపిల్లల సంఖ్యతో పోలిస్తే ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ప్రతి నెలా డివిజన్‌లోని 19 స్కానింగ్ సెంటర్లను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో రికార్డుల నిర్వహణ సరిగా ఉందా, లేదా అనే విషయాలను పరిశీలించాలని చెప్పారు. స్కానింగ్‌కు వచ్చే గర్భిణుల వయస్సును తప్పనిసరిగా నమోదు చేసేలా చూడాలన్నారు. డీఎస్పీ కేవీవీఎన్ ప్రసాద్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు, ఐసీడీఎస్ సీడీపీఓ పిల్లి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మండలంలోని ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు జరిగిన నిరసనలో ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నాయకులు ఖండించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక్క డీఏ కూడా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. నేటివరకు పీఆర్సీ కమిషన్ వేయకపోవడం దురదృష్టకరమని చెపాపరు. గత పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఈ ఏడాది నూతనంగా ఏర్పాటు చేసిన అసెస్మెంట్ బుక్ విధానం అశాస్త్రీయమని, విద్యార్థులు కాపీ చేయడానికి దోహదం చేస్తుందన్నారు. అసెస్మెంట్ బుక్ విధానం రద్దు చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకుంటే భవిష్యత్‌లో పోరాటం చేస్తామని హెచ్చరించారు. మండల శాఖ అధ్యక్షుడు వి.నరేంద్ర, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లు షేక్ మునీర్ బాషా, పీవీ దుర్గాప్రసాద్, సుగుణ కుమారి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

నూజివీడు: ఇంటింటికీ తిరిగి సర్వేలు నిర్వహించే విధుల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను తప్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని వార్డు సచివాలయ సిబ్బంది శుక్రవారం నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్లుగా ఒకే క్యాడర్‌లో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇతర సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సర్వీస్ రెగ్యులరైజేషన్‌ను డేట్ ఆఫ్ జాయినింగ్ నుంచి తీసుకొని నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న విధంగా సచివాలయ ఉద్యోగులకు బదిలీలను నిర్వహించాలని, అంతర్ జిల్లా బదిలీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వీడని గాయత్రి హత్య కేసు మిస్టరీ

మైలవరం: మైలవరంలో గత నెల 31న అదృశ్యమైన బాలిక గాయత్రి (13) హత్య కేసు మిస్టరీ వీడలేదు. తన కుమార్తెను తానే కొట్టి చంపి వాగులో పడేశానని గాయత్రి తండ్రి బాజీ పోలీసుల విచారణలో ఒప్పుకున్నప్పటికీ సైంటిఫిక్‌గా ప్రూవ్ చేసేందుకు పోలీసులకు ఆధారాలు లభించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. నిందితుడు బాజీ చెప్పినట్లు మధిర, వైరా మధ్యలో ఉన్న వైరా ఏరు వద్ద డ్రోన్‌లతో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు.

సీసీ పుటేజీ లభించినప్పటికీ..

గత నెల 31న అర్ధరాత్రి బాజీ ఒక మూటను ఆటోలో తీసుకుని వెళ్లి ఖాళీ ఆటోతో తిరిగి వచ్చినట్లు సీసీ కెమెరా పుటేజీ పోలీసులకు లభించినప్పటికీ ఆ మూటలో ఉన్నది గాయత్రి శవమేనని రుజువు చేయడానికి పోలీసుల వద్ద ఆధారాల్లేవు. ఈ కేసు పోలీసులకు సవాలుగా మారింది. ఈ కేసులో సాక్ష్యం చెప్పడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. దీనికి కారణం బాజీ క్రిమినల్ బ్యాక్‌గ్రౌండేనని తెలుస్తోంది. గంజాయి కేసులో ఇరికించిందని కూతురు గాయత్రిపై కక్ష పెంచుకున్న బాజీ కుమార్తెను చంపేందుకు జైలులోనే ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది.

పంచాయతీ కార్మికుల తొలగింపు దారుణం



ధర్నా చేస్తున్న వార్డు సభ్యుడు నరసింహ

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి పంచాయతీలో పదేళ్లకుపైగా పనిచేస్తున్న కార్మికులను కార్యదర్శి ఏకపక్షంగా తొలగించడం దారుణమని శుక్రవారం నిర్వహించిన పంచాయతీ సమావేశంలో వార్డు సభ్యుడు నిమ్మగడ్డ నరసింహ అన్నారు. సమావేశంలో ఆందోళనకు దిగారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గం అనుమతి లేకుండా కార్మికులను సెక్రటరీ ఎలా తొలగిస్తారని నిలదీశారు. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లుగా తలాడించి ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను తొలగించి వారిని రోడ్డున పడవేయడం దారుణమన్నారు. వార్డు సభ్యుడి ఆందోళనతో పాత కార్మికులను కొనసాగించాలని పాలకవర్గం తీర్మానం చేసింది.

పెద్దచెరువు ఆక్రమణల తొలగింపు

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లి రోడ్డులోని ఊర చెరువు (పెద్ద చెరువు) కట్టను ఆక్రమించి నిర్మించిన ఇళ్ల తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం అధికారులు చేపట్టారు. తమ ఇళ్లు తొలగించవద్దని మహిళలు జేసీబీకి అడ్డుగా కూర్చోగా పోలీసులు వారిని పక్కకు తీసుకువెళ్లి కూల్చివేశారు. అధికారులు మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించాలని రెండు నెలల కిందటే పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారని, మరోసారి చెప్పారని అయినా తొలగించలేదన్నారు. తహసీల్దార్ కె. లక్ష్మీ కల్యాణి, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, ఇరిగేషన్ డీఈ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

తిరువూరు: గంపలగూడెంలో శుక్రవారం మృతిచెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మేచినేని మోహనరావు నేత్రాలను లయన్స్ జిల్లా కేబినెట్ సభ్యుడు గోగిరెడ్డి కృష్ణారెడ్డి చొరవతో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు దానం చేయడానికి మృతుడి కుటుంబ సభ్యులు అంగీకరించారు. వైద్యులు మోహనరావు కార్నియాలు సేకరించారు.

కొండపల్లిలో పాలస్తీనా సంఘీభావ యాత్ర

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పాలస్తీనాకు సంఘీభావంగా కొండపల్లిలో శుక్రవారం రాత్రి పాలస్తీనా సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఉద్యమ నేత ఆర్.రఘు మాట్లాడుతూ ఇజ్రాయెల్ దురాక్రమణ పూరిత వలసవాదాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. పాలస్తీనా ప్రజల విముక్తి పోరాటానికి ప్రజలు సంఘీభావంగా నిలవాలని కోరారు. డాక్టర్ సురేష్, ప్రొఫెసర్ శ్రీనివాసరావు, న్యాయవాది అమూల్య, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో మోదీ ప్రభుత్వ పాలన

సీపీఐఎంఎల్ లిబరేషన్

చాట్రాయి: ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నరేంద్ర మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్ విమర్శించారు. మండలంలోని చిత్తపూరు గ్రామంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ట్రంపు భారత దేశ వస్తువులపై సుంకాలు విధిస్తే మోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.హరనాథ్, జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య దశకోటి కుంకుమార్చన మహాయాగం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ హాల్‌లో స్వామి అభిషేక్ బ్రహ్మచారి జై మహరాజ్ ఆధ్వర్యంలో శ్రీవిద్య దశ కోటి కుంకుమార్చన, పూజా కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే పూజా కార్యక్రమాలను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం జై మహరాజ్ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి మందికి పైగా మహిళలు, ఆధ్యాత్మిక గురువులు పాల్గొన్నారు.

నేటి నుంచి హిందీ పరీక్షలు

తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమవుతాయని హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ తెలిపారు. తిరువూరు సర్వోదయ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు, ఆదివారం ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష పరీక్షలు జరుగుతాయని వివరించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: వైరల్ ఫీవర్ ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ పేర్కొన్నారు. జి.కొండూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆధునీకీకరించిన సమావేశ హాల్‌ని ఎంపీపీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శాఖల వారీగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి వంటి అంశాలను సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా స్వచ్ఛమైన నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, డెప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థి సన్నీ ఆచూకీ లభ్యం

ఇబ్రహీంపట్నం: అన్నమ్మ దివ్యాంగుల హాస్టల్‌లో నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిన దివ్యాంగ విద్యార్థి సన్నీ ఆచూకీ లభించింది. పోలీసులు, బంధువులు కలిసి విజయవాడ పరిసర ప్రాంతాల్లో గాలించగా గురువారం తెల్లవారుజామున భవానీపురం వద్ద లారీ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు నల్లమోతు సుభాష్ బృందం బాలుడిని గుర్తించారు. వెంటనే ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి విద్యార్థి సన్నీని అప్పగించారు. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన దైదా జోజిబాబు, జోత్స్న దంపతుల కుమారుడు సన్నీకి (మూగ, వినికిడి లోపం) ఉండటంతో పదో తరగతి విద్య కోసం మూడు నెలల కిందట దివ్యాంగుల పాఠశాలలో చేర్పించారు. బాలుడు అదృశ్యం విషయంపై హాస్టల్ యజమాని వసంత కుమారి విలేకరులతో మాట్లాడుతూ కొందరు కావాలని తమ సంస్థపై దురుద్దేశంతో విష ప్రచారం చేశారని ఆరోపించారు.

నిజమైన లారీ ఓనర్లకు న్యాయం జరగాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లారీ ఓనర్ల ముసుగులో ఉన్న కూటమి నేతల ముసుగు ఇప్పుడిప్పుడే తొలగిపోతోందని కొండపల్లి మున్సిపల్ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ గుంజా శ్రీనివాస్ అన్నారు. లారీ ఓనర్ల ముసుగులో ఫ్లైయాష్‌పై పోరాడుతుంది లారీ ఓనర్లు కాదని, కూటమి నేతలనే విషయం ర్యాలీలు, ప్రెస్‌మీట్‌లలో తేటతెల్లం అయిందని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఇంతకాలం లోకల్ లారీ యజమానుల పేరుతో దోచుకున్నది ఇక చాలన్నారు. కాలుష్యం బారిన పడిన గ్రామాల లారీ ఓనర్లకు తప్పనిసరిగా న్యాయం జరగాలని చెప్పారు. ఓనర్ల ముసుగులో ఉన్న నేతలకు లోడింగ్ చేయాల్సిన అవసరం లేదన్నారు. బూడిద కాంట్రాక్టులో ఎన్టీటీపీఎస్‌కు సమకూరిన రూ.1.50 కోట్ల నిధులు కాలుష్య ప్రభావిత గ్రామాల్లో ప్రజారోగ్యానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ దక్కించుకున్న సూట్‌కేస్ కంపెనీ ఎవరిదో కూటమి నేతలు తేల్చాలని హితవు పలికారు.

కళా ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం: గుడ్లవల్లేరు మండలం అంగలూరులో జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన జి.విజ య (కూచిపూడి), జస్సీ ప్రణీత(సంప్రదాయ కథ), భార్గవ్ (సోలో యాక్షన్), బి.కై లాష్, రామ్‌చరణ్, అ ఖిలాష్ (ఇన్‌స్ట్రుమెంట్ డ్రమ్స్), పి.కై లాష్ (డ్రమ్స్) విభాగాల్లో ప్రతిభ చాటారు. కేతనకొండ ఇమ్మానియేల్ పాఠశాల బాలికలు వెంకట సునీత, గీతిక, మే ఘన థీమ్, దృశ్య కళలు విభాగంలో వరుసగా ప్రథ మ, ద్వితీయ, తృతీయ స్థానాలు కై వసం చేసుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. డైట్ నోడల్ అధికారి కొచ్చెర్ల మోహన్ చేతుల మీదుగా మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. హెచ్‌ఎంలు సంతోష్‌కుమార్, మేకపోతుల స్వాతి అభినందించారు.